క్లుప్తంగా

సమష్టి కృషితో కాలుష్యాన్ని నివారిద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో కాలుష్యాన్ని నివారిద్దామని ఎంవీఐ విజయకుమారి అన్నారు. శనివారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్ సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులు విధిగా తమ వాహనాన్ని స్విచ్ ఆఫ్ చేయాలని కోరారు. తద్వారా కాలుష్యాన్ని నియంత్రించడం తోపాటు ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మల్లికార్జున, ఎంవీఐ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ముదివేడు రిజర్వాయర్ వద్ద రైతు సభ

కురబలకోట : మండలంలోని పిచ్చలవాండ్లపల్లె గ్రామం ముదివేడు రిజర్వాయర్ వద్ద ఆదివారం ఉదయం పది గంటలకు రిజర్వాయర్‌కు సంబంధించి రైతులతో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి శనివారం తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో నిర్వహిస్తున్న సభకు నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు హాజరుకావాల్సిందిగా కోరారు.

వేరుశనగ విత్తనకాయలు సిద్ధం

పీలేరు : పీలేరు, కేవీపల్లె మండలాలకు 4,400 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఏడీఏ వై.వి. రమణరావు తెలిపారు. రెండు మండలాల్లోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో నారాయణిరకం విత్తన కాయలు 30 కేజీల బ్యాగ్ ప్రభుత్వ రాయితీపోనూ రూ. 1773తో అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఆర్‌బీకేలలో కంది, చిరు ధాన్యాలు, జీలుగ, కట్టి జనుము విత్తనాలు 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి

వాల్మీకిపురం : భారత ప్రభుత్వం కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ డీఆర్ అంబేడ్కర్ పేరును పెట్టాలని ఏపీ మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొప్పసముద్రం శ్రీనివాసులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చింతపర్తిలో ఏర్పాటు చేసిన ఏపీ మాలమహానాడు సమావేశంలో హాజరైన మాలమహానాడు నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పార్లమెంటుకు అంబేడ్కర్ పేరు పట్టడం సముచితమని మాలమహానాడు నాయకులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గుండ్లూరి మహేష్, శంకర, తదితరులు పాల్గొన్నారు.


క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు అవకాశం

మదనపల్లె సిటీ : వైఎస్సార్ కడప జిల్లాలోని వైఎస్సార్ క్రీడా పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి 4,5 తరగతుల్లో ప్రవేశాలకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ షేక్ షఫీ తెలిపారు. వచ్చే నెల 15 నుంచి 20 వరకు మండల స్థాయిలోను, 22 నుంచి 26వతేదీ వరకు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని 29,30 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు పంపిస్తామన్నారు. 4వతరగతిలో ప్రవేశానికి 8 నుంచి 9 సంవత్సరాల వయస్సు, 5వతరగతిలో ప్రవేశాలకు 9 నుంచి 10 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిమ్మనపల్లెలో ఉపాధిహామీ సామాజిక తనిఖీలు

నిమ్మనపల్లె : మండల పరిధిలో 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ ఏపీవో రమేష్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 2022 – 23ఆర్థిక సంవత్సరానికిగానూ ఉపాధి హామీ పథకంలో 1848 పనులు చేశామన్నారు. అందుకుగానూ రూ.4,22,70,000లు ఉపాధి హామీ నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇందులో 1715 పనులు హౌసింగ్ విభాగం, 98 పనులు ఉపాధి హామీ విభాగంలో, 35 పనులు మెటీరియల్ కాంపోనెంట్ కింద నిధులు ఖర్చు చేసినట్లు చెప్పారు. క్షేత్రస్థాయి తనిఖీల అనంతరం జూన్ 3వ తేదీన సామాజిక తనిఖీ బహిరంగసభ నిర్వహిస్తామన్నారు.

కలికిరి ఎస్ఐగా ఎస్కే రహీముల్లా



కలికిరి: కలికిరి ఎస్ఐగా ఎస్కే రహీముల్లా శనివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ కార్యాలయ ఉత్తర్వుల మేరకు వీరబల్లి నుంచి కలికిరికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం స్టేషన్‌కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ, హెడ్‌కానిసేబుల్‌లు, పీసీలు, హోంగార్డులు తదితరులు నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని నూతన ఎస్ఐ అన్నారు.

ఎవరేమంటారులే అని..

- కొండలు, గుట్టలకు ఆకతాయిలు నిప్పు
- నియోజకవర్గంలో 2450 ఎకరాల్లో కాలిపోయిన వైనం
- కొండలు, గుట్టల దిగువ పొలాల రైతులు రాత్రిళ్లు జాగరణ
- నీళ్ల ట్యాంకర్లు, స్ప్రే మిషన్ల ద్వారా మంటలు అదుపుచేస్తున్న రైతులు



గుర్రంకొండ కొండలో మంటలు ఎగిసి పడుతున్న దృశ్యం (ఇన్‌సెట్) మంటలు పొలాల్లోకి రాకుండా నీళ్లట్యాంక్‌లు సిద్ధంగా ఉంచిన రైతులు

గుర్రంకొండ : పీలేరు నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు రాత్రంతా జాగారం చేసే పని తప్పడం లేదు. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తులు కొండలు, గుట్టలకు నిప్పు అంటిస్తున్నారు. దీంతో 2450 ఎకరాల్లో కొండలు, గుట్టలు కాలి బూడిదయ్యాయి. ఆయా పరిసర పొలాలకు చెందిన రైతులు మంటలు పొలాల వైపు రానీయకుండా రాత్రిళ్లు పొలాల వద్దే జాగారం చేశారు. నీళ్ల ట్యాంకర్లు, స్ప్రే మిషన్ల ద్వారా పొలాలవైపు వస్తున్న మంటల్ని రైతులు అదుపు చేసే ప్రయత్నాలు చేశారు.

2530 ఎకరాల్లో కాలిపోయిన కొండలు, గుట్టలు

గత 20 రోజులుగా నియోజకవర్గంలోని కొండలు, గుట్టలకు కొంతమంది దుండగులు కావాలనే నిప్పు పెడుతున్నారు. అన్ని మండలాల్లో ఇప్పటివరకు 55 మార్లు అగ్నిప్రమాదాలు జరిగి మొత్తం 2530 ఎకరాల్లో కొండలు, గుట్టలతోపాటు మామిడితోటలు, పొలాలు కాలిబూడిదయ్యాయి. రాత్రిళ్లు ఉన్నట్టుండి కొండలు, గుట్టల్లో మంటలు చెలరేగుతున్నాయి. పరిసరా పొలాల రైతులు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నారు. చెట్లు, పొదలతో పాటు పక్షులు, సర్పాలు, అడవి జంతువులు అగ్నికి ఆహుతి అయ్యాయి. నియోజకవర్గంలోని జాతీయ రహదారులుకు ఇరువైపులా ఉన్న కొండలు, గుట్టలు రాత్రి పగలు అనే తేడా లేకుండా కాలుతూనే ఉండడం గమనార్హం.

మంటలు అదుపు చేయడానికి అవస్థలు:

కాలుతున్న కొండలు, గుట్టలు కింది భాగంలో పెద్ద ఎత్తున మామిడితోటలు, ఇతరత్రా ఉద్యానవన తోటలతోపాటు పలురకాల పంటలు సాగు అవుతున్నాయి. దీంతో రైతులు రాత్రిళ్లు పొలాల దగ్గరే కాపాలా కాస్తూ జాగారం చేస్తున్నారు. టెంకాయపట్టలు,పచ్చి వేపకొమ్మలు, దుమ్ముధూలితో గుట్టల దిగువైపు వస్తున్న మంటలను అదుపు చేసే ప్రయత్నాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో చుక్కనీరు లేక పోవడంతో పట్టణం నుంచి వాటర్ ప్యాకెట్ల బస్తాలను తీసుకెళ్లారు. మరికొందరు గుట్టల్లో నుంచి వచ్చే మంటలు పొలాలవైపు రానీయకుండా జేసీబీతో పొలాల సరిహద్దుల్లో గోతులు తవ్వారు. ఇలా రాత్రిళ్లూ రైతులు నానా కష్టాలు పడ్డారు. కొంతమంది కావాలనే పరిసరాల్లో ఇష్టానుసారం కొండలు,గుట్టలకు నిప్పు అంటిస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

ట్యాంకర్లు, స్ప్రే పంపులతో..

కొండలు, గుట్టలు దిగువ భాగాన ఉన్న పొలాల ఆరైతులు ఎగిసి పడుతూ పొలాలవైపు వస్తున్న మంటల్ని అదుపు చేసేందకు పొలాల వద్ద నీళ్ల ట్యాంకులు సిద్ధం చేసుకొంటున్నారు. నీళ్ల ట్యాంకులతో పాటు పంటలపై మందులు స్ప్రే(పిచికారి) చేసే పెట్రోల్ పంపులు, ఇంజన్లను పొలాల వద్దకు తీసుకెళుతున్నారు. మంటలు కొండలు, గుట్టల నుంచి పొలాలవైపు వచ్చే సమయంలో నీళ్ల ట్యాంకుల నుంచి నీటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నింపి తద్వారా పెట్రోల్ ఇంజన్లు, పైపుల ద్వారా నీటిని మంటలపై స్ప్రే చేస్తూ అదుపు చేస్తున్నారు. ఇలాంటి ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. గంటల వ్యవధిలోనే మంటలను పొలాలవైపు రానీయకుండా ఈపద్ధతి ద్వారా అదుపు చేస్తున్నారు.

అగ్నిప్రమాదాలు, కాలిపోయిన కొండలు, గుట్టల విస్తీర్ణం వివరాలు

మండలం పేరు	అగ్నిప్రమాదాల సంఖ్య,	కాలిపోయిన విస్తీర్ణం (ఎకరాల్లో)
గుర్రంకొండ	14	1250
పీలేరు	08	240
కలకడ	09	185
కేవిపల్లె	07	225
కలికిరి	09	345
వాల్మీకిపురం	08	285

మంటలు పొలాలకు వ్యాపిస్తున్నాయి



కొన్నిరోజులు మా పొలాల సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లో మంటలు పెద్ద ఎత్తున చెలరేగి పొలాలకు వ్యాపిస్తున్నాయి. మంటలు పొలాలవైపు రాకుండా అదుపు చేయడం కోసం అక్కడే జాగారం చేయాల్సి వస్తోంది. మాతో పాటు పరిసరా పొలాల రైతుల కూడా పొలాల వద్దనే ఉంటున్నారు. నీళ్లట్యాంక్‌లు,స్ప్రే పంపులు పొలాల వద్ద ఉంచుకొంటున్నాం. – రామన్న, రైతు కొత్తపల్లె

కావాలనే నిప్పు పెడుతున్నారు



కొండలు, గుట్టలకు గత పదిరోజులుగా కావాలనే నిప్పు పెడుతున్నారు. కొంతమంది వ్యక్తులు పొలాల వద్ద చెత్తా చెదారం కాల్చిచేయాలనే ఉద్దేశంతో నిప్పు పెడుతున్నారు. దీంతో అవి పెద్ద ఎత్తున ఎగిసి పడుతూ పరిసరా పొలాలతో పాటు కొండలు, గుట్టల్ని కాల్చి బూడిద చేస్తున్నాయి. మంటలు అదుపు చేసే వారే లేక పదిరోజులు కొండలు,గుట్టలు, అడ్డూ అపులేకుండా కాలుతూనే ఉన్నాయి. – నారాయణ, పసలవాండ్లపల్లె

మోసగాళ్ల కోసం కర్ణాటక పోలీసుల గాలింపు

పీలేరు : ఎర్రచందనం మొక్కల పేరుతో చీటింగ్‌కు పాల్పడిన మొక్కల వ్యాపారుల ముఠా కోసం కర్ణాటక పోలీసులు పీలేరులో గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలిలావున్నాయి. శనివారం పీలేరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. పీలేరుకు చెందిన కొందరు మొక్కలు వ్యాపారులు ముఠాగా ఏర్పడి ఒరిస్సా, ఛతీష్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, కర్ణాటక రాష్ట్రాల్లో ఎర్రచందనం మొక్కలు విక్రయిస్తూ రైతుకు మొక్కలు నాటితే పెన్షింగ్, బోరు, మెయింటెనెన్స్‌కింద రుణం మంజూరవుతుందని నమ్మబలికి లక్షలాది రూపాయలు అడ్వాన్సుగా తీసుకుని ఉడాయించినట్లు పలు ప్రాంతాల్లో పోలీసులకు ఫిర్యాదులు అందాయి. గత ఏడాది కూడా ఛతీష్‌ఘడ్‌లో చీటింగ్‌కు పాల్పడి అరెస్ట్ అయిన విషయం విదితమే. అదే ముఠా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలో రైతుల వద్ద రూ.45 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. దీంతో అక్కడ ఫిర్యాదులు అందుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించండి



మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

పెద్దతిప్పసముద్రం : మండల ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా వారికి అవగాహన కల్పించాలని ఎస్ఐ రవీంద్రబాబు సూచించారు. శనివారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మహిళా పోలీసులతో సమీక్షించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల గారడీ మాటలకు, నకిలీ వెబ్‌సైట్‌లకు గ్రామీణ ప్రాంత అమాయకులే కాక చదువుకున్న విద్యావంతులు సైతం మోసపోతున్నారన్నారు. ఆన్‌లైన్ మోసగాళ్ళ నుంచి ఫోన్‌ల ద్వారా, మెసేజ్‌ల ద్వారా వచ్చే సందేశాలకు ఆకర్షితులై చివరకు మోసపోయామని గ్రహించి న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగం అని, ఇంట్లో నుంచి మొబైల్ ద్వారానే ఉద్యోగం చేస్తే నెలకు ఐదంకెల జీతం అని నమ్మించడం, లక్కీ డ్రాలో మీ నంబర్ ఎంపికైంది, రూ.16 వేల విలువ చేసే మొబైల్‌ను రూ.4 వేలకే ఇస్తామని ఇలాంటి మాయమాటలతో ప్రజల వివరాలు సేకరించి గుట్టుగా వారి ఖాతాల్లోని నగదును కాజేస్తున్నారన్నారు. ప్రజలు మోసపోకుండా అవగాహన కల్పించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లె : ప్రజలు చోరీలు, అసాంఘిక కార్యక్రమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. శనివారం మండల పరిధిలో అవగాహన కల్పిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ఇళ్లల్లో ఎక్కువగా చోరీలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు ఇళ్లకుతాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు తప్పక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విధానంలో సంబంధిత ఇంటిపై యజమానులు తిరిగి ఇంటికి చేరేంత వరకు పోలీసుల నిఘా ఉంటుందన్నారు. పాఠశాలలకు వేసవి సెలవులు ఉన్నకారణంగా పిల్లలు, విద్యార్థులు ఈతకు స్థానికంగా ఉన్న నీటికుంటలు, చెరువులకు వెళ్లి ప్రమాదాల భారినపడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

రామసముద్రం : మండలంలో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ చంద్రశేఖర్ కోరారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు రామసముద్రం మండలం కర్ణాటక సరిహద్దులో ఉండటం వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమానంగా తిరిగినట్టు తెలిస్తే వెంటనే తమకు సమాచారం తెలియజేయాలన్నారు. విలువైన భరణాలు, నగదు ఉన్నట్టయితే అవసరమైతే తప్ప వాటిని ఉపయోగించరాదన్నారు. ఇంటి నుంచి ఎక్కడైనా వెళ్లాలనుకుంటే మీ దగ్గర ఉన్న విలువైన వస్తువులు ఇంటిలో పెట్టినప్పుడు పోలీస్‌స్టేషన్లో సమాచారం అందించాలన్నారు. అప్పుడు మీ ఇంటికి రక్షణగా మీకు అండగా పోలీసులు ఉంటారని తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

తంబళ్లపల్లె : ప్రభుత్వ స్థలం ఆక్రమణపై స్థానికులు రెవెన్యూ, పోలీసు అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రఘుపతి, జయరామ్, కుమార్, ప్రభాకర్, పార్వతి,రామలక్ష్మమ్మ, ఈశ్వరమ్మ, దామోదర్ ఉన్నారు. తంబళ్లపల్లె పంచాయతీ పరషతోపు కాలనీలో గతంలో చిన్నేరుప్రాజెక్టు నిర్మాణం ముంపునకు గురైన నిర్వాసితులకు ప్రభుత్వం ఇంటి స్థలాలను మంజూరు చేసింది. 66 కుటుంబాల వారికి ఇంటిస్థలం, పక్కా ఇండ్లు మంజూరు చేయడంతో కాలనీ ఏర్పాటు అయింది. అందులో 10 సెంట్లు ఖాళీ స్థలాన్ని స్థానికుల సౌకర్యం కోసం కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం, గుడి నిర్మించుకునేందుకు కేటాయించారు. ఆ కాలనీ వాసులు ముగ్గురు ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

భక్తితోనే ముక్తికి మార్గం

కలకడ : భక్తితోనే ముక్తికి మార్గం. దైవకృపతోనే ఆరోగ్యం, ఆనందం సౌభాగ్యం సాధ్యమని శివమాల పీఠాధిపతి చింతర్ల మల్లికార్జునస్వామి, ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శనివారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో వెలసిన శ్రీసాయి మందిరం 13వ వార్షికోత్సవం ధర్మకర్త పూజారి నాగయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. పెద్దలను గౌరవించాలని, మంచి చేసేవారికి అంతా మంచి జరుగుతుందని ఉద్బోధించారు. మరొకరికోసం కాకుండ ఆత్మసాక్షింగా మంచి చేయాలనే తపన ప్రతి ఒక్కరిలో పెంచుకోవాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి నరసింహులు, మదనపల్లెకు చెందిన గంగయ్య, శ్రీరాములు, జీవన్‌స్వాములు , మాజీ సర్పంచ్ గుర్రప్ప, సాయిదాసు, రాజమాత తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న మల్లికార్జునస్వామి

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

పెద్దతిప్పసముద్రం : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి కూలీలకు సూచించారు. శనివారం ఆయన మండలంలోని టి.సదుం పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పూడిక తీత పనులను తనిఖీ చేశారు. అనంతరం పని ప్రదేశంలో కూలీల సంఖ్య, మస్టర్లలో నమోదైన పేర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని క్షేత్ర స్థాయి, సాంకేతిక సిబ్బందిని ఆదేశించారు. బిల్లులు సకాలంలో ఖాతాల్లో జమ అవుతున్నాయా, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏపీవో మహేష్ ఉన్నారు.



మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



పరిసరాల శుభ్రత కార్యక్రమంలో అటవీ అధికారులు

పీలేరు రూరల్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎఫ్ఆర్‌వో బి. రామ్లానాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని అటవీ కార్యాలయం, తలపుల, మేళ్లచెరువు, మారేళ్ల, వగళ్ల బీట్ల పరిధిలో అటవీ సమీప గ్రామాల్లో జీవన విధానములో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమవంతు బాధ్యతగా ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో వేణు, ఎఫ్‌బీవోలు మునిస్వామినాయక్, వెంకటేశ్వర్లు, రెడ్డి ఆసియాబీ, చంద్రకళ, సబియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు పంపిణీ

కురబలకోట: మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద కురబలకోట, కనసానివారిపల్లె గ్రామాలకు చెందిన 107 మందికి శనివారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో ఇండ్లు లేని పేదలకు తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు, సర్పంచ్ సుక్కా సుజాత ఆధ్వర్యంలో పట్టాలు అందజేశారు. లాటరీ విధానం ద్వారా పారదర్శకంగా పంపిణీ చేశారు. స్థలాలను కూడా చూపించారు. సొంతింటి కల సాకారం అవుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. నాయకులు ఈశ్వర్, రమణారెడ్డి, యాసాన్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, ఆర్ఐ సుగుణ, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్వోలు రవీంద్ర, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న తహసీల్దారు, నాయకులు

త్యాగానికి చిహ్నం రమాబాయి అంబేద్కర్



రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాస్, వీసీకే నాయకులు

మదనపల్లె : భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి త్యాగానికి చిహ్నమని భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక బాస్ కార్యాలయంలో బాస్, వీసీకే సంయుక్త ఆధ్వర్యంలో రమాబాయి వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీటీఎం.శివప్రసాద్ మాట్లాడుతూ.. ఒక సాధారణ వ్యక్తిగా ఉన్న అంబేడ్కర్ అసాధారణ శక్తిగా అవతరించడం వెనుక మాతా రమాబాయి త్యాగం ఎంతో ఉందన్నారు. ఆమె జీవితకాల కష్టమే ఈరోజున రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాల ప్రజలు అనుభవిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వీసీకే రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాలమోహన్, బాస్ నాయకులు నీరుగట్టిరమణ, చాట్లబయన్న, టీఏ.పీర్‌బాషా, గిన్నెలమనోహర్‌రెడ్డి, సొన్నికంటిరెడ్డెప్ప, పెద్దపాలెంరవిశంకర్, రాయల్‌సూర్య, బురుజురెడ్డిప్రసాద్ పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి రమాబాయి అంబేద్కర్

పీలేరు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ సతీమణి రమాబాయి ఆదర్శమూర్తి అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శనివారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో రమాబాయి 88వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తుమ్మల ధరణికుమార్, సుభాష్, పాలకుంట శ్రీనివాసులు, మల్లికార్జు, రవీంద్ర, ఆనంద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి వసతితో కరువు నివారణ

తంబళ్లపల్లె : నియోజకవర్గంలో రైతులకు సాగునీరు వసతి కల్పించి శాశ్వత కరువు నివారణకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మంత్రి రామచంద్రారెడ్డి , ఎంపీ మిథున్‌రెడ్డి కృషి చేస్తున్నారని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముదివేడు రిజర్వాయర్‌ను మంజూరు చేశారన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రూ.కోట్ల ఖర్చుతో రిజర్వాయర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. అభివృద్ధి కుటుంపడుతుందని నోర్లు చించుకునే టీడీపీ నాయకులు, అభివృద్ధి పనులకు అడ్డుకునేందుకు కటిల యత్నాలు చేస్తున్నారన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం ముదివేడు రిజర్వాయర్ వద్ద ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయం వద్ద బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తప్పక హాజరు కావాలని కోరారు. సమావేశంలో మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ రెడ్డి మల్‌రెడ్డి , నియోజకవర్గం రైతు సంఘం నాయకులు జయసింహారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల కన్వీనర్ చౌడేశ్వర్, వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు గంట్ల సురేంద్ర,కోటిరెడ్డి, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రవీంద్ర బాబు

పెద్దతిప్పసముద్రం : ఆటో డ్రైవర్లకు శనివారం ఎస్ఐ రవీంద్రబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. యూనిఫాంతో పాటు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినా, మద్యం సేవించి ఆటోలు నడిపినా, ప్రయాణికుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, నిషేధిత సరుకులు, వస్తువులు అక్రమంగా తరలించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాద రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ హితబోధ చేశారు.

రూ. 3 లక్షలతో బోరు, మోటారు ఏర్పాటు



బోరుకు మోటారు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పీలేరు : స్థానిక సైనిక్‌నగర్‌లో ముస్తఫా మసీద్ వద్ద రూ. 3 లక్షలతో బోరు, మోటారు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం మోటారు, పైపులైన్ ఏర్పాటు చేశారు. పనులు పర్యవేక్షించిన సర్పంచ్ మాట్లాడుతూ మసీదుకు, స్థానిక ప్రజల సౌకర్యార్థం కొత్తగా బోరు డ్రిల్లింగ్ చేసినట్లు తెలిపారు. పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా బోర్ల తోపాటు మోటార్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : పీలేరు పోలీస్ సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా చోరీలు చోటు చేసుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి సమయంలో దుకాణాలు వద్ద సీసీ కెమెరాలు ఆన్‌లో ఉంచుకోవాలని తెలిపారు. ఇలాగే ఇళ్లవద్ద తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. పిల్లలను చెరువులు, బావుల, వంకల వద్దకు ఈతకు పంపరాదని కోరారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు.

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో విశిష్టమైన పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో పారాలీగల్ వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాసంఘం అధ్యక్షుడు స్థానిక న్యాయమూర్తి ఉమర్‌ఫారుఖ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థులు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలను స్థానిక కోర్టులో తీసుకుని పూర్తిచేసిన వాటిని మండల న్యాయసేవాసంఘం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అందజేయాలని తెలిపారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ

మదనపల్లె సిటీ : చదువుల్లో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ఉన్నత చదువుల వైపు వెళ్తున్న పేదింటి విద్యార్థిని ఎ.మమతకు ఉచితంగా ల్యాప్‌టాప్ వితరణ చేసినట్లు వెలుగు సెక్రటరీ యం.ఉదయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కొత్తకోట మండలం బండారువారిపల్లె పంచాయతీ పెద్దపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులు, సుమతీల కుమార్తె ఎ.మమత పదో తరగతిలో 90 శాతం, ఇంటర్‌లో 95 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ప్రస్తుతం నంద్యాలలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.

ఆర్ఎంఓకు సన్మానం

మదనపల్లె : మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ దివాకర్‌ను ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పాల్‌రవికుమార్, వైద్య సిబ్బందితో కలిసి సన్మానించారు. ఇటీవల ఆయన అనంతపురం జిల్లా మడకశిర ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవోగా బదిలీ అయ్యారు. శనివారం ఆయన రిలీవ్ కావడంతో సిబ్బంది సన్మాన సభ నిర్వహించారు.